సాక్షి తిరుపతి

శుక్రవారం, 7, జూన్, 2024



జిల్లాలో మోస్తరు వర్షం

తిరుపతి జిల్లాలో గురువారం మోస్తరు వర్షం కురిసింది. జిల్లా వ్యాప్తంగా 819.6 మి.మీ వర్షపాతం నమోదైంది.

- 8లో



టీడీపీ శ్రేణుల అరాచకం

జిల్లాలో టీడీపీ శ్రేణులు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలే లక్ష్యంగా చెలరేగి పోతున్నారు. దాడులకు తెగబడుతున్నారు.

- 8లో



విద్యుదాఘాతంతో..

జింకలు, అడవి పందుల కోసం ఏర్పాటు చేసిన అక్రమ విద్యుత్ కంచె తగిలి ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు.

- 8లో

న్యూస్‌రీల్

పార్టీ శ్రేణులకు అండగా కమిటీల ఏర్పాటు

సాక్షి, తిరుపతి: రాష్ట్రంలో ఎన్నికల తర్వాత భయానక వాతావరణం నెలకొంది. ప్రభుత్వం ఏర్పాటు కాకముందే టీడీపీ ముఠాలు రాష్ట్ర వ్యాప్తంగా చెలరేగిపోతున్నారు. ఎక్కడికక్కడ దాడులకు తెగబడుతున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులకు దిగుతూ అత్యంత పాశవికంగా ప్రవర్తిస్తున్నారు. ఈ సమయంలో పార్టీ నాయకులకు అండగా ఉండేందుకు వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం కమిటీలను పార్టీ ఏర్పాటు చేసింది. ఈ కమిటీ ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటుందని, అలాగే అక్కచెల్లెమ్మలు, సోషల్‌మీడియా సైనికులకు తోడుగా నిలుస్తుందని ప్రకటించింది. బాధిత కుటుంబాలను పరామర్శించడమే కాకుండా, వారిని అన్ని రకాలుగా ఆదుకుంటామని ఆ ప్రకటనలో పేర్కొంది. ఈ మేరకు చిత్తూరు పార్లమెంటు పరిధిలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, భరత్, ఆర్కే రోజా, సునీల్‌కుమార్, వెంకటేగౌడ, రెడ్డెప్ప, చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, కృపాలక్ష్మి, విజయానందరెడ్డిని నియమించింది. తిరుపతి పార్లమెంటు పరిధిలో నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి, ఎం.గురుమూర్తి, బల్లి కల్యాణ్ చక్రవర్తి, మేరిగ మురళీధర్, సిపాయి సుబ్రమణ్యం, కాకాణి గోవర్ధన్ రెడ్డి, కే.సంజీవయ్య, బియ్యపు మధుసూధన్ రెడ్డి, భూమన అభినయ్, ఎన్. రాజేష్‌ను నియమించినట్లు అందులో పేర్కొంది.

పరిశోధన ప్రాజెక్ట్ కోసం రూ.8.78 లక్షల విడుదల



ఆర్థిక ప్రోత్సాహకాన్ని అందజేస్తున్న వీసీ భారతి

తిరుపతి సిటీ: జీవవైవిధ్య పరిరక్షణ కోసం 'క్యాంపస్ బయోడైవర్సిటీ రిజిస్టర్ల సృష్టి' అనే పరిశోధన ప్రాజెక్ట్ కోసం రాష్ట్ర ఉన్నత విద్యామండలి నుంచి రూ.8,78,000 ఆర్థికసాయం లభించిందని పద్మావతి మహిళా వర్సిటీ వీసీ డీ.భారతి తెలిపారు. గురువారం వర్సిటీలో ఈ మేరకు ఆర్థికసాయం అందించిన పత్రాలను సంబంధిత అధికారులకు ఆమె అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పద్మావతి మహిళా వర్సిటీ ఇంటర్ ఇన్‌స్టిట్యూషనల్ కొలాబరేషన్ క్లస్టర్ యాక్టివిటీలో భాగంగా పరిశోధన నిమిత్తం ఆర్థిక ప్రోత్సాహం లభించిందన్నారు. రిజిస్ట్రార్ రజిని, ఇంటర్ ఇన్‌స్టిట్యూషనల్ డైరెక్టర్ డీఎం మమత, ప్రాజెక్ట్ ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ రాబిన్ విజయన్, ఐఐటీ సివిల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీరింగ్ విభాగం ప్రొఫెసర్ ప్రసన్న వెంకటేశ్ సంపత్, తిరుపతి ఐసర్ బయాలజీ విభాగం ప్రొఫెసర్ నందని రాజారమణి, మెర్సీజ్యోతి, రాజేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

రాపూరు డిగ్రీ కళాశాల్లో కొత్త కోర్సులు



హనుమంతరావు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్

రాపూరు: రాపూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో ఈ ఏడాది నుంచి కొత్త కోర్సులు ప్రారంభించనున్నట్లు ప్రిన్సిల్ డాక్టర్ హనుమంతరావు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాపూరులో గత 40 ఏళ్లుగా బీకాం, బీఏ కోర్సులు మాత్రమే ఉండేవని, అయితే ఈ ఏడాది నుంచి బీఎస్సీ కంప్యూటర్‌సైన్స్, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్ కోర్సులను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కోర్సుల ప్రవేశానికి ఈనెల 18వ తేదీ నోటిఫికేషన్ విడుదల చేస్తామని, చేరదలచిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు ఫీజు కళాశాల భరిస్తుందన్నారు. విద్యార్థులకు ఉచితంగా మధ్యాహ్న భోజన సదుపాయం కల్పిస్తున్నట్లు వెల్లడించారు.

పొలాలపై ఏనుగుల దాడి

సదుం: మండలంలోని చెరుకువారిపల్లె పంచాయతీ పోతంవారిపల్లె సమీప పంట పొలాలపై ఏనుగులు బుధవారం రాత్రి విరుచుకు పడ్డాయి. గురువారం ఉదయం రైతులు పొలాల వద్దకు వెళ్లిన సమయంలో పంటలు ధ్వంసమై ఉండడాన్ని గుర్తించారు. బాధిత రైతు ప్రకాష్ మాట్లాడుతూ అటవీ సమీప ప్రాంతంలోని ఎకరా టమాట పొలంలో ఏనుగులు విధ్వంసం సృష్టించాయని తెలిపారు. పంట పూర్తిగా దెబ్బతినిందని పేర్కొన్నారు. అలాగే మామిడి తోటల్లో కొమ్మలను సైతం విరిచి వేశాయి.



దెబ్బతిన్న టమాట పొలం

తామేలు!

- తాబేళ్లతో సముద్ర జలాల్లో సమతుల్యత
- జీవవైవిధ్యానికి ఎంతో మేలు
- నానాటికీ అంతరించిపోతున్న కచ్ఛపములు
- సంరక్షణ బాధ్యత తీసుకున్న అటవీ, వైల్డ్ లైఫ్ అధికారులు
- పదేళ్లుగా సముద్రంలోకి తాబేలు పిల్లలు వదులుతున్న వైనం
- హేచరీలు ఏర్పాటు చేసి మరీ సంరక్షణ
- ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపు

తాబేళ్లు సముద్ర జీవకోటి మనుగడకు ఎంతో మేలు చేస్తాయని శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. సముద్రంలోని బండ రాళ్లపై ఉన్న నాచుని తినడం వల్ల మత్స్యసంపద వృద్ధి చెందుతుందని చెబుతున్నారు. అలాగే మత్స్యసంపదకు సింహస్వప్నంగా తయారైన జెల్లీ ఫిష్‌లాంటి వాటిని సంహరించడానికి దోహదపడుతాయని, సముద్ర జలాలు కలుషితం కాకుండా కాపాడవచ్చని పేర్కొంటున్నారు. అయితే వీటి మాంసానికి ఉన్న డిమాండ్ కారణంగా విచ్చలవిడిగా సంహరిస్తున్నారని ఆవేదన చెందుతున్నారు. ప్రతి ఒక్కరూ తాబేళ్లను సంరక్షించాలని పిలుపునిస్తున్నారు. ఇందులో భాగంగానే అటవీ, వైల్డ్‌లైఫ్ అధికారులు సముద్ర తీర ప్రాంతాల్లో హేచరీలు ఏర్పాటు చేసి తాబేలు గుడ్లు పొదిగిన తర్వాత పిల్లలను సముద్రంలోకి వదులుతున్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు కూడా తాబేళ్ల సంరక్షణకు ముందుకు రావాలని పిలుపునిస్తున్నారు.



తాబేళ్లు.. ఎన్నో మేళ్లు!

- సముద్రంలో జీవించే తాబేళ్ల కదలికల వల్ల పర్యావరణంలో సమతుల్యత దెబ్బ తినకుండా ఉంటుంది.
- మత్స్యసంపదకు సింహస్వప్నమైన జెల్లీ ఫిష్‌లను నివారిస్తాయి.
- సముద్రంలోని బండ రాళ్లపై నాచుని తినడం వల్ల బండలు శుభ్రంగా ఉండి చేపలు గుడ్లు పెట్టేందుకు అనుకూలంగా ఉంటుంది.
- తీర ప్రాంతం కోతకు గురికాకుండా దోహదపడుతాయి.
- సముద్రంలోని వ్యర్థాలు తినడంతో నీరు పరిశుభ్రంగా ఉండే అవకాశం ఉంది.

చిల్లకూరు: అంతరించి పోతున్న జీవకోటిలో ప్రధానంగా తాబేలు ఒకటి. అయితే దీనిని సంరక్షించేందుకు అటవీ, వైల్డ్ లైఫ్ శాఖలు నడుము కట్టాయి. ఇందులో భాగంగానే చెన్నైలోని సీ ఫౌండేషన్ సంస్థతో కలిసి జిల్లాలోని సముద్ర తీరంలో హేచరీలు ఏర్పాటు చేసి గుడ్లు పొదిగిస్తున్నాయి. ఆ తర్వాత తాబేలు పిల్లలను సముద్రంలోకి వదులుతున్నాయి. సముద్రంలోని జీవరాశులు అన్నీ సమానంగా ఉంటే జీవ వైవిధ్యానికి ఎలాంటి ఢోకా ఉండదు. అయితే ఇటీవల తాబేళ్లను సంహరించి సొమ్ము చేసుకునే వారు ఎక్కువ కావడంతో ఇవి నానాటికీ అంతరించి పోతున్నాయి. దీంతో సముద్రంలో జీవ వైవిధ్యం పూర్తిగా దెబ్బతింటోంది. తాబేళ్లు లేక పోవడంతో సముద్రంలోని నీరు కలుషితమవుతోందని ఆవేదన చెందుతున్నారు. దీని నివారణకు తాబేళ్లను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఉద్ఘాటిస్తున్నారు.

తాబేళ్ల సంరక్షణకు పెద్దపీట

సముద్రం ఒడ్డున తాబేలు గుడ్లు పెడుతుంది. వీటిని ఏరి ఒక చోట ఉంచి పొందిగించి పిల్లలను చేసే బాధ్యతలను ఇటీవల కాలంలో అటవీ, వైల్డ్ లైఫ్ అధికారులు చేపడుతున్నారు. ఇందులో భాగంగానే చెన్నైకి చెందిన సీ ఫౌండేషన్ సంస్థతో కలిసి తాబేళ్ల సంరక్షణ బాధ్యతలను 2005 నుంచి తీసుకున్నారు. వీటిని సూర్యుడు ఉదయించే సమయంలో లేత కిరణాలు వాటిపై పడుతున్నప్పుడు సముద్రంలోకి వదలుతారు. అయితే ఇవి సముద్రంలోకి వెళ్లిన 16 ఏళ్ల తర్వాత అవి ఎక్కడి నుంచి అయితే సముద్రంలోకి వెళ్లాయో అదే ప్రాంతానికి తిరిగి వచ్చి గుడ్లు పెడుతాయని శాస్త్రవేత్తల అధ్యయనంలో తేలింది. తాబేలు జీవిత కాలం సుమారు 152 ఏళ్లు. ఆలీవ్ రిడ్లే తాబేళ్లు బంగాళాఖాతంలో ఎక్కువగా జీవిస్తాయి. ఇవి ప్రతి ఏడాదీ జనవరి నుంచి ఏప్రిల్ వరకు గుడ్లు పెడుతాయి. ఒక్కొక్కటీ సుమారు 75 నుంచి 150 వరకు గుడ్లు పెడుతుంటాయి. ఈ క్రమంలోనే ఈ ఏడాది ఇప్పటికే చిల్లకూరు, కోట, వాకాడు సముద్ర తీర ప్రాంతాల్లోని తీగపాళెం, శ్రీనివాసపత్రం, నవాబుపేట ప్రాంతాల నుంచి సుమారు 20 వేల తాబేళ్ల పిల్లలను సముద్రంలోకి వదిలినట్లు అధికారులు చెబుతున్నారు.



సముద్రంలోకి వదులుతున్న తాబేలు పిల్లలు (ఇన్‌సెట్) ఆలీవ్ రిడ్లే తాబేలు పిల్లలు, పొదిగిస్తున్న గుడ్లు(ఫైల్)

తాబేళ్లను వదిలాం



వాకాడు, చిల్లకూరు, కోట మండలాల్లోని సముద్ర తీరంలోని బీచ్‌ల వద్ద ఇప్పటికే సుమారు 20 వేల తాబేళ్ల పిల్లలను సముద్రంలోకి వదిలాం. ఉన్నతాధికారుల ప్రోత్సాహం బాగుంది. అందుకే ఐదు తీర ప్రాంతాల్లో గుడ్లు పొదిగించే ఏర్పాట్లు చేస్తున్నాం. పర్యాటకులు ప్లాస్టిక్ వ్యర్థాలను వదలి వెళితే అవి సముద్ర జలాల్లో కలిసి సముద్రంలోని జీవరాశుల మనుగడకు ముప్పు వాటిల్లితుంది. దీనిని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలి.

– గాయం శ్రీనివాసులు(తమ్మినపట్నం సెక్షన్ అధికారి)

చర్యలు తప్పవు



సముద్రంలోని తాబేళ్లే కాకుండా నదులు, చెరువుల్లో, బావుల్లో జీవించే తాబేళ్లను కూడా ఎవరైనా అక్రమంగా పట్టి తరలిస్తున్నట్లు గుర్తిస్తే వారిపై చట్ట పరమైన చర్యలు తప్పవు. నేరం రుజువైతే ఏడేళ్ల జైలు శిక్ష కూడా పడుతుంది. ప్రస్తుతం ఆలీవ్‌రిడ్లే తాబేళ్లను సముద్రంలోకి వదులుతున్నాం.

– సతీష్‌రెడ్డి(జిల్లా అటవీ అధికారి, తిరుపతి)

మీకోసం ఎందాకైనా..

- చంద్రగిరిలో చెలరేగుతున్న టీడీపీ శ్రేణులు
- వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై కొనసాగుతున్న భౌతిక దాడులు
- బాధితుల ఇంటికి నేరుగా వెళ్లి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పరామర్శ

చంద్రగిరి/మంగళం: ''పార్టీ కార్యకర్తలు, నాయకులు అందరినీ నా కుటుంబ సభ్యులుగానే చూశా. మీకు ఏ కష్టం వచ్చినా మీ వెంటే ఉంటా.. మిమ్మల్ని వదిలిపెట్టను. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు తెలుగు దేశం పార్టీకి అధికారం ఇస్తే పది మందికి మంచి చేయాలే కానీ ఇలా దాడులు చేస్తుండడం దుర్మార్గమైన చర్య. అయినా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు సంయమనం పాటించండి. అకారణంగా గొడవలకు వెళ్లొద్దు.. అది మన సంస్కృతి కాదు..'' అంటూ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తమ పార్టీ నేతలు, కార్యకర్తలకు సూచించారు. చంద్రగిరి నియోజకవర్గవ్యాప్తంగా గత 48 గంటల్లో 11 మంది వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై విచక్షణా రహితంగా టీడీపీ నేతలు దాడులు చేశారు. కొంత మందిని బెదిరింపులకు గురిచేసి ఆ కుటుంబాల్లో ఆందోళన రేకెత్తించారు. ఇళ్ల వద్ద రెక్కీలు చేస్తూ హడావుడి సృష్టించారు. టీడీపీ శ్రేణుల దాడిలో గాయపడిన కార్యకర్తలు, నేతలు ఇళ్లకు గురువారం చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి నేరుగా వెళ్లి వారికి నేనున్నాను అంటూ ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ''టీడీపీకి అధికారం రాగానే చంద్రగిరి నియోజకవర్గంలో ఆ పార్టీ నేతలు చెలరేగారు.. చేతిలో కత్తులు, కర్రలు పట్టుకుని యథేచ్ఛగా తిరుగుతున్నారు.. వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపై భౌతిక దాడులకు తెగబడి రక్తం కళ్ల చూస్తున్నారు.. ఏకంగా వారి ఇళ్ల వద్దకు వెళ్ళి మరీ కొడుతున్నారు.. ఊరిలో లేని వారికి ఫోన్లు చేసి బండ బూతులు తిట్టి చంపుతామని బెదిరింపులకు పాల్పడుతూ భయానక వాతావరణం సృష్టిస్తున్నారు. ఇంత జరుగుతున్నా పోలీసులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడం దారుణం'' అన్నారు. చంద్రగిరి నియోజకవర్గంలో ప్రశాంతతకు భగం కలగకుండా ప్రతి ఒక్కరూ సంయమనంతో ఎవరి పనులు వారు చేసుకుంటే బాగుంటుందని హితవు పలికారు. అంతకు ముందు పోలీసు ఉన్నతాధికారులతో చర్చించిన చెవిరెడ్డి పరిస్థితి చక్క బెట్టాలని విజ్ఞప్తి చేశారు. పోలీసుల ఉదాసీనత వైఖరిని ఎండగట్టి పరోక్షంగా గొడవలను ప్రోత్సహించే పోలీసులపై ప్రయివేట్ కేసులు పెడతామన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటు కాక ముందే టీడీపీ నేతల ఆగడాలు శ్రుతి మించడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు ఎప్పుడు ఏ అవసరం వచ్చినా తోడుగా నిలచి ఎంత వరకైనా ఆదుకుంటానని భరోసా ఇచ్చారు. గత ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి పనులను ధ్వంసం చేస్తున్నా పట్టించుకోని పోలీసులపై అసంతృప్తి వ్యక్తం చేశారు



టీడీపీ నాయకుల దాడిలో గాయపడిన వార్డు సభ్యుడు సక్కూరు వంశీని పరామర్శిస్తున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి



ముదిలియార్ రమేష్, మహమ్మద్ ఖాసిం, మహేశ్వర్‌రెడ్డి, తిరుమల నగర్ పంచాయతీ ఉపసర్పంచ్ తిరుమల ప్రసాద్ బాబు తమ్ముడు చిట్టిబాబును పరామర్శిస్తున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి



దాడిలో గాయపడిన చంద్రగిరి మండల కన్వీనర్ మస్తాన్‌ను పరామర్శిస్తున్న చెవిరెడ్డి

రామచంద్రాపురంలో...



టీడీపీ నేతల దాడిలో గాయపడ్డ హరి

రామచంద్రాపురం : మండలంలోని పరమాల దళితవాడకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త హరిపై అదే గ్రామానికి చెందిన కొందరు టీడీపీ నేతలు గురువారం దాడికి తెగబడ్డారు. ఈ దాడిలో హరికి గాయాలు కావడంతో అతన్ని తిరుపతి రుయాకు తరలించారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి బాధితుడిని కలిసి పరామర్శించారు. దాడి ఘటనపై ఆరాతీశారు. అనంతరం చెవిరెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలు, నాయకులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని చెప్పారు.



తనపై జరిగిన దాడిని చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి వివరిస్తున్న హరి

17 నుంచి పద్మావతమ్మ తెప్పోత్సవాలు

- చివరి మూడు రోజులు తెప్పపై వివిధ రూపాల్లో దర్శనమివ్వనున్న శ్రీవారి పట్టపురాణి

చంద్రగిరి(తిరుచానూరు): తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి వార్షిక తెప్పోత్సవాలు జూన్ 17 నుంచి 21వ తేదీ వరకు ఐదు రోజులపాటు ఘనంగా నిర్వహించనున్నట్లు టీటీడీ అధికారులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రోజూ సాయంత్రం 6.30 నుంచి రాత్రి 7.30 గంటల వరకు అమ్మవారు పద్మ సరోవరంలో తెప్పలపై విహరించి భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఈ ఉత్సవాల్లో శ్రీఅలమేలు మంగమ్మ పద్మసరోవర తీరంలో పాంచరాత్ర ఆగమపూజలు అందుకుని భక్తులను అనుగ్రహించనున్నారు. ప్రతి సంవత్సరం అమ్మవారికి జ్యేష్ఠ శుద్ధ ఏకాదశి నుంచి పౌర్ణమి వరకు రమణీయంగా తెప్పోత్సవాలు నిర్వహించడం ఆనవాయి. తెప్పోత్సవాల్లో పాల్గొన్న వారి బాధలు, సంసార దుఃఖాలు తొలగి, మోక్షం సిద్ధిస్తుందని భక్తుల నమ్మకం. పద్మసరస్సులో బంగారు పద్మం నుంచి ఆవిర్భవించిన అలమేలు మంగమ్మ జీవకోటికి మాతృమూర్తిగా మారి భవజలధిలో మునిగిపోకుండా రక్షించి, సర్వసౌఖ్యాలు ప్రసాదిస్తారని తెప్పోత్సవాల అంతరార్థం.

ఆర్జితసేవలు రద్దు

తెప్పోత్సవాల కారణంగా అమ్మవారి ఆలయంలో ఐదు రోజులపాటు కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, జూన్ 21న లక్ష్మీ పూజను రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు, దాస సాహిత్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ప్రతిరోజు ఆధ్యాత్మిక, భక్తి సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు, కోలాటాలు నిర్వహించనున్నారు.

21 వరకు తెప్పోత్సవం

జూన్ 17వ తేదీ మొదటి రోజు రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణస్వామి, రెండో రోజు శ్రీసుందరరాజస్వామి, చివరి మూడు రోజులు శ్రీ పద్మావతి అమ్మవారు తెప్పలపై విహరించనున్నారు. చివరి మూడు రోజులపాటు పద్మ సరోవరంలోని నీరాడ మండపంలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు అమ్మవారికి స్నపన తిరుమంజనం నిర్వహించనున్నారు. అమ్మవారికి జూన్ 20వ తేదీ రాత్రి 8.30 గంటలకు గజ వాహనం, జూన్ 21వ తేదీ రాత్రి 8.30 గంటలకు గరుడ వాహనసేవ నిర్వహిస్తారు. తెప్పోత్సవం అనంతరం ప్రతిరోజూ ఆలయ మాడ వీధుల్లో అమ్మవారి ఊరేగింపు నిర్వహించనున్నారు.

ప్రభుత్వ సలహాదారు పదవికి జ్ఞానేంద్రరెడ్డి రాజీనామా



జ్ఞానేంద్రరెడ్డి

పెనుమూరు(కార్వేటినగరం): ఎస్ఆర్ఐ ప్రభుత్వ సలహాదారు పదవికి మహా సముద్రం జ్ఞానేంద్రరెడ్డి గురువారం రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను సీఎస్ జవహర్‌రెడ్డికి పంపారు. 2024 ఎన్నికల్లో ప్రజా తీర్పును గౌరవిస్తూ తన పదవికి రాజీనామా చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

కుప్పంలో పెరిగిన ఫ్యాన్ గ్రాఫ్

కుప్పం : టీడీపీ కంచుకోటగా ఉన్న కుప్పంలో ప్రతి ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఓట్ల శాతం పెరుగుతోంది. ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో చంద్రబాబు 47,324 ఓట్ల మెజారిటీతో ఎనిమిదో సారి విజయం సాధించారు. ఈ నియోజకవర్గంలో 2014 నుంచి ఎన్నికల నుంచి వైఎస్సార్ సీపీ పోటీ చేస్తోంది. విశ్రాంత ఐఏఎస్ అధికారి చంద్రబాబు వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా 2014లో చంద్రబాబుపై పోటీ చేశారు. ఈ ఎన్నికల్లో ఆయన 55,839 ఓట్లు సాధించారు. చంద్రమౌళి మరణానంతరం ఆయన కుమారుడు భరత్ పార్టీ అభ్యున్నతికి కృషి చేశారు. 2019 ఎన్నికల్లో 69,424 ఓట్లు వైఎస్సార్‌కి రావడంతో 13,585 ఓట్లు వైఎస్సార్ గ్రాఫ్ పెంచుకుంది. ప్రస్తుత ఎన్నికలో 73,923 వచ్చా యి. దీంతో ఈ సారి ఎన్నికల్లో 4,299 ఓట్లు వైఎస్సార్ సీపీకి పెరిగింది. ప్రతి ఎన్నికల్లో ఓట్లు శాతం పెరుగుతుండడం గమనార్హం.

క్లుప్తంగా

కంప్యూటర్ డెస్క్‌టాప్ పబ్లిషింగ్‌పై ఉచిత శిక్షణ

చంద్రగిరి: యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ చంద్రగిరిలో జూన్ 10 తేదీ (సోమవారం) నుంచి 30 రోజుల పాటు పూర్తి ఉచితంగా పురుషులు, మహిళలకు కంప్యూటర్ డెస్క్‌టాప్ పబ్లిషింగ్(డీటీపీ)పై ఉచిత శిక్షణ కార్యక్రమం ప్రారంభించనున్నట్లు సంస్థ డైరెక్టర్ పీ.సురేష‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తెల్లరేషన్ కార్డు కలిగిన తిరుపతి, చిత్తూరు జిల్లా గ్రామీణ ప్రాంతానికి చెందిన 19 నుంచి 45 సంవత్సరాల మధ్య వయసు కలిగిన నిరుద్యోగ పురుషులు, మహిళలు శిక్షణకు అర్హులని తెలిపారు. కనీస విద్యార్హత 10వ తరగతి చదువుకుని ఉండాలని, శిక్షణ సమయంలో ఉచిత భోజనం, రాను పోను ఒక్కసారి చార్జీలు ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. శిక్షణ పూర్తిచేసుకున్న వారికి ధ్రువపత్రాలు కూడా ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల వారు ఆధార్ కార్డు, రేషన్ కార్డు జిరాక్స్ కాపీలు, 4 పాసుపోర్టు సైజు ఫొటోలతో సంస్థకి వచ్చి వారి పేరు నమోదు చేయించుకోవలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, 11-48 ద్వారకానగర్ (రాయల్ విక్టరీ స్కూల్ దగ్గర) కొత్తపేట , చంద్రగిరి. ఫోన్: 79896 80587, 94949 51289, 63017 17672 సంప్రదించాలన్నారు.

టీడీపీ శ్రేణుల అరాచకం

- వాగివేడులో వలంటీర్ల ఇళ్లపై దాడులు
- ఇంటి నుంచి బయటకు రాకుండా నిర్బంధం
- వీధికి అడ్డంగా ట్రాక్టర్, టైర్లు పెట్టి నానా రభస
- గ్రామానికి చేరుకుని నాకాబందీ నిర్వహించిన పోలీసులు


వాగివేడులో వలంటీర్ పృథ్వి ఇంటి చుట్టూ అడ్డంగా పెట్టిన ట్రాక్టర్, వ్యవసాయ పనిముట్లు

శ్రీకాళహస్తి రూరల్: శ్రీకాళహస్తి నియోజకవర్గంలో టీడీపీ శ్రేణులు ప్రతీకార దాడులకు తెగబడుతున్నాయి. శ్రీకాళహస్తి మండలం, వాగివేడులో బుధవారం అర్ధరాత్రి గ్రామ వలంటీర్ మహేశ్వరి ఇంటి వద్ద నానాయాగి చేశాయి. గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు నాగేంద్ర, మరికొందరు మద్యం మత్తులో కత్తులు చేతబట్టి మూకుమ్మడిగా ఆమె ఇంటిపై దాడికి దిగారు. ఆ సమయంలో బాధితురాలు ప్రాణభయంతో పక్కింటికి వెళ్లి తలదాచుకుంది. ఇంట్లోని వస్తు సామగ్రి, తలుపులను ధ్వంసం చేశారు. 'మిమ్మల్ని చంపితే మీకు దిక్కవరు..?' అంటూ విరుచుకుపడ్డారు. గతంలో రేణిగుంట సమీపంలోని డిక్సన్ కంపెనీలో పనిచేసే నాగేంద్ర దంపతలను ఫ్యాక్టరీ యాజమాన్యం రెండు నెలల కిందట తొలగించింది. దానికి మహేశ్వరి కారణమని కక్ష గట్టి ఆమెపై ఉద్దేశపూర్వకంగా దాడి చేసేందుకు నాగేంద్ర ప్రయత్నించాడని తెలుస్తోంది. అంతటితో ఆగకుండా అదే గ్రామంలో ఉన్న మరో వలంటీర్ పృథ్వి ఇంటికి వెళ్లి అతనిపై, వారి తల్లిదండ్రులపై దాడులు చేశారు. వారు ఇంటి నుంచి బయటకు రాకుండా ఇంటి చుట్టూ ట్రాక్టర్, టైర్లు, వ్యవసాయ పనిముట్లు, ముళ్ల కంచె వేసి భయభ్రాంతులకు గురిచేశారు. తమ ప్రభుత్వం వచ్చిందని, మీరంతా ఊరొదిలి వెళ్లిపోవాలని, లేకుంటే గ్రామంలో బతకనివ్వమని బెదిరింపులకు పాల్పడ్డారు. బాధితులు డయల్ 100కు ఫోన్ చేయడంతో పోలీసు సిబ్బంది వచ్చి పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేశారు. అయినా టీడీపీ కార్యకర్తలు పోలీసుల ఎదుటే వలంటీర్ల ఇళ్ల మీదకు మరోమారు దాడికి యత్నించారు. 'మీరు ఇళ్ల నుంచి బయటకు రావొద్దు' అంటూ పోలీసులు ఉచిత సలహాలు ఇవ్వడం స్థానికులను విస్మయానికి గురిచేసింది. తాము గత ప్రభుత్వంలో వలంటీర్లుగా పనిచేశామని, అయితే కొందరు టీడీపీ నాయకులు కక్షగట్టి ఇళ్లపైకి వచ్చి వికృత చేష్టలకు పాల్పడుతున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు, తమ కుటుంబ సభ్యులకు గ్రామంలోని టీడీపీ నాయకుల నుంచి ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని వేడుకున్నారు.


వలంటీర్ పృథ్వి కుటుంబం

గ్రామంలో నాకాబందీ

విషయం తెలుసుకున్న శ్రీకాళహస్తి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రెడ్డి, సీఐ అజయ్‌కుమార్ కేంద్రబలగాలతో కలిసి వాగివేడు గ్రామానికి చేరుకున్నారు. వలంటీర్ల ఇళ్లకు అడ్డంగా వేసిన కంచెను తొలగించారు. గ్రామంలో 144 సెక్షన్ అమలు చేసి ఎలాంటి అల్లర్లు చోటుచేసుకోకుండా పోలీసు పహారాను ఏర్పాటు చేశారు. ప్రతి పౌరునికీ వ్యక్తిగత స్వేచ్ఛ ఉంటుందని, దానికి భంగం వాటిల్లేలా ఎవరైనా ప్రవర్తిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు.


వలంటీర్ మహేశ్వరి ఇంటి తలుపులను ధ్వంసం చేసిన టీడీపీ నాయకులు

విద్యుదాఘాతంతో ఇద్దరికి గాయాలు

- త్రుటిలో తప్పిన ప్రాణాపాయం
- జింకల కోసం అటవీభూముల్లో అక్రమంగా వేసిన విద్యుత్ కంచె


విద్యుత్ షాక్‌తో గాయపడిన అంకయ్య, వెంకటేశ్వర్లు

నాయుడుపేట టౌన్: మండల పరిధిలోని శ్రీనివాసపురం గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో అక్రమంగా వేసిన విద్యుత్ కంచె తగిలి ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. పోలీసులు, విద్యుత్‌శాఖ అధికారుల కథనం.. మండల పరిధిలోని శ్రీనివాసపురం ఎస్టీ కాలనీకి చెందిన తుపాకుల అంకయ్య, వేటగిరి వెంకటేశ్వర్లు గ్రామ సమీపంలో ఉన్న చెరువులో చేపలు పట్టేందుకు గురువారం ఉదయమే బయల్దేరి వెళ్లారు. మార్గమధ్యంలో అటవీ ప్రాంతంలో నడిచి వెళుతుండగా జింకలు, అడవి పందుల కోసం అక్రమంగా వేసి ఉన్న విద్యుత్ కంచె తగిలి కింద పడిపోయారు. వీరికి విద్యుత్ తీగ తగిలిన వెంటనే ఫ్యూజు పోవడంతో ఇద్దరూ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. దీనిపై సమాచారం అందుకున్న ఎస్ఐ గోపి, విద్యుత్ ఏఈ వెంకటస్వామి, రెవెన్యూ అధికారులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అక్కడి అటవీ భూములో అక్రమంగా చాలావరకు విద్యుత్ కంచెను ఏర్పాటు చేసి, 11 కేవీ విద్యుత్ స్తంభాలకు వేసి ఉన్న కనెక్షన్లు పరిశీలించారు. కొంత మంది అక్రమార్కులు అటవీ ప్రాంతంలో జింకలు, అడవి పందుల కోసం అక్రమంగా విద్యుత్ కంచెను ఏర్పాటు చేసినట్టు అధికారులు గుర్తించారు. శ్రీనివాసపురం అటవీ ప్రాంత సమీపంలో ఉన్న పెళ్లకూరు మండలం, రోసనూరు గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు ఈ తరహా కంచెలను ఏర్పాటు చేస్తున్నట్టు స్థానికులు ఆరోపించారు. స్థానిక అటవీశాఖ డీఆర్వో సెలవులో ఉండడంతో ఎఫ్‌బీఓ శీను సిబ్బందితో శ్రీనివాసపురం అటవీ భూములను పరిశీలించారు. రోసనూరు తదితర ప్రాంతాల్లో సైతం పరిశీలించారు. ఈ సంఘటనపై విత్యుత్ శాఖ అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

తెలుగు సాహిత్యంలో రాలిన కలువ

- బావుక రవి కలువగుంట రామమూర్తి మృతి


కలువగుంట రామమూర్తి (ఫైల్)

తిరుపతి కల్చరల్: తెలుగు సాహిత్యంలో తన రచనలతో తెలుగు భాష వికాసానికి నిరంతరం కృషి చేసిన కలువ రాలిపోయింది. ప్రముఖ కవి, రచయిత, బావుక బ్రహ్మ కలువగుంట రామమూర్తి గురువారం ఉదయం ఆకస్మికంగా మృతి చెందారు. వీరు టీటీడీలో ఉద్యోగం చేస్తూ పదవీ విరమణ పొందారు. తెలుగు భాష అన్నా, సాహిత్యమన్నా అత్యంత మక్కువ చూపే ఈయన అనేక కవితలు, రచనలు చేసి సాహిత్య పరిమళాలతో తెలుగు భాష ప్రతిభకు తన వంతు కృషి చేశారు. నీట్‌గా ఇన్‌షర్ట్‌తో సదా చిరునవ్వుతో పలకరిస్తూ ఆప్యాయతను పంచే సున్నిత మనస్కులు. ఎక్కువగా ప్రబంధ కాలపు వస్తువు తీసుకొని నవలలు రాసి మెప్పించారు. అంతేకాక తిరుపతిలో ఏ సాహితీ కార్యక్రమం చేసినా అందులో మొదటి వరుసలో కూర్చుని అందరినీ ఆప్యాయంగా పలకరించే గొంతు నేడు మూగపోయింది. రేణిగుంట రోడ్డులో నివాసం ముంటున్న కలువగుంట రామమూర్తికి భార్య పార్వతి, కొడుకు ఉన్నారు. కవి, రచయిత కలువగుంట రామమూర్తి ఆకస్మిక మృతి పట్ల తిరుపతి జిల్లా సాహిత్యకారులు, దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. తిరుపతి జిల్లా రచయితల సంఘం, అభ్యుదయ రచయితల సంఘం, తెలుగు భాషోద్యమ సమితి నేతలు, పలువురు సాహితీ వేత్తలు కలువగుంట రామమూర్తి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కలువగుంట మృతి పట్ల తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేస్తూ ఆయనతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కలువగుంట రామమూర్తి దహన క్రియలు శుక్రవారం ఉదయం 11 గంటలకు మంగళం రోడ్డులోని గోవిందధామంలో నిర్వహించనున్నట్లు వారి కుటుంబ సభ్యులు తెలియజేశారు.

యూపీఎస్సీ పరీక్షకు పటిష్ట ఏర్పాట్లు

తిరుపతి అర్బన్: నగరంలో ఈనెల 16న యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమ్స్ పరీక్షకు పటిష్ఠ ఏర్పాట్లు చేపట్టినట్టు డీఆర్వో పెంచల కిషోర్ తెలిపారు. ఆ మేరకు ఆయన కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సంబంధిత అధికారులతో గూగల్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 16వ తేదీన యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమ్స్ పరీక్షకు తిరుపతి జిల్లాలో మొత్తం 11 సెంటర్లు కేటాయించగా.. 5,518 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్టు తెలిపారు. 11 మంది తహసీల్దార్లను లైజన్ అధికారులుగా వ్యవరిస్తారన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు.


సూచనలు ఇస్తున్న డీఆర్వో పెంచల కిషోర్

కారు ఢీ.. ద్విచక్ర వాహన దారుడికి తీవ్ర గాయాలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పద్మావతీపురం గ్రామం కేటీరోడ్డుపై గురువారం ద్విచక్ర వాహనాన్ని అతివేగంగా కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. నీర్పాక్కోట దళితవాడకు చెందిన దామతొట్టి అఖిలేష్ శ్రీకాళహస్తి నుంచి స్వగ్రామానికి ద్విచక్రవాహనంలో బయలుదేరాడు. మార్గమధ్యం పద్మావతీపురం వద్ద వరదయ్యపాళెం నుంచి శ్రీకాళహస్తి వైపు వెళ్తున్న కారు ద్విచక్రవాహనాన్ని అతివేగంగా ఢీకొట్టింది. అఖిలేష్‌కు రెండు కాళ్లు విరిగాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని స్థానిక ఆస్పత్రికి తరలించారు.

ముందు వెళ్తున్న లారీని ఢీకొని..

- మాజీ సైనికోద్యోగి మృతి
- నేంద్రగుంట సమీపంలో ఘటన


మృతి చెందిన స్కూటరిస్ట్ మణి

పాకాల: ముందు వెళుతున్న లారీని వెనుక నుంచి ఢీకొనడంతో స్కూటరిస్ట్ అక్కడికక్కడే మృతిచెందిన ఘటన గురువారం మండలంలోని నేంద్రగుంట సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం.. విశ్రాంత సైనికోద్యోగి మణి తిరుపతి సమీపంలోని చెర్లోపల్లి వద్ద డిఫెన్స్ అకాడమీలో పనిచేస్తున్నారు. చిత్తూరు పట్టణంలోని దొడ్డిపల్లి సాయి వీధిలో నివాసం ఉంటున్న అతను వారానికి ఒకసారి ఇంటికి వెళ్లేవాడు. ఈ క్రమంలో గురువారం ఇంటికి వెళ్తూ పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారి, నేద్రగుంట సమీపంలోని వంతెనపై ముందు వెళుతున్న లారీని వెనుక నుంచి ఢీకొనడంతో మణి(50) అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరుకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ మహేష్‌బాబు తెలిపారు.

శ్రీషిర్డీ సాయి మందిరానికి రూ.3,00,116 విరాళం


వెండి మాలను విరాళంగా అందజేస్తున్న ఉమా

తిరుపతి కల్చరల్: కొంకావీధిలోని శ్రీద్వారకమయి శ్రీషిర్డీ సాయి బాబా సేవా సమాజ్ సాయి బాబా మందిరానికి భక్తులు గురువారం రూ.3,00,116 విరాళంగా అందజేశారు. పూతలపట్టుకు చెందిన డి.దామోదర నాయుడు రూ.2 లక్షలు సప్తగిరి గ్రామీణ బ్యాంకులో నెట్ బ్యాంకింగ్ ద్వారా విరాళం అందించారు. ఎ.రామ్‌మోహన్ సతీమణి పార్వతమ్మ జ్ఞాపకార్థం రూ.1,00,116 విరాళంగా అందజేశారు. కేశవాయనగుంటకు చెందిన భక్తురాలు ఉమా 108 రుద్రాక్షల వెండి మాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీషిర్డీ సాయి సేవా సమాజ్ గౌరవాధ్యక్షుడు మబ్బు దేవనారాయణరెడ్డి, కార్పొరేటర్ కుడితి సుబ్రమణ్యం, దుర్గం శ్రీనివాస్, మర్దం శివ, పి.విజయలక్ష్మి, సి.రమేష్, కె.హరిబాబు, బి.కళావతి, మనోహర్, బాలకృష్ణ, వై.లక్ష్మి, కె.ప్రభాకర్, సాయి భక్తులు పాల్గొన్నారు.

ఆదాయంలో టాప్ గేర్!

- ఆర్టీసీ ఆదాయంలో తిరుపతి జిల్లా రాష్ట్రంలోనే టాప్
- 2024-25లో రూ.750 కోట్ల రాబడే లక్ష్యం


తిరుపతి సెంట్రల్ బస్టాండ్

తిరుపతి అర్బన్: రాష్ట్రంలోనే తిరుపతి జిల్లా ఆర్టీసీ రాబడిలో ఆదర్శంగా నిలుస్తోంది. 2021-22లో రూ.482 కోట్లు, 2022-23లో రూ.565 కోట్లతో ప్రథమ స్థానాన్ని దక్కించుకుంది. మూడో సారీ మరింత ఆదాయం గడించేలా అధికార యంత్రాంగం ప్రణాళిక రచించింది. 2024-25లో రూ.750 కోట్లు టార్గెట్‌గా నిర్దేశించుకుంది. గత ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబర్ 30వ తేదీ వరకు జిల్లా ఆర్టీసీ రాబడి రూ.307.88 కోట్లుగా నమోదైంది. వచ్చే ఆరు నెలల పాటు అంతకుమించి ఆదాయం వచ్చేలా అధికారులు, సిబ్బంది పని చేస్తున్నారు. మొత్తంగా 2023-24కు జిల్లా రాబడి రూ.650 కోట్లు సాధించగా.. దీన్ని మరింత పెంచేదిశగా అడుగులు వేస్తున్నారు. సాధారణంగా ఒక రోజు జిల్లా ఆర్టీసీ ఆదాయం రూ.1.45 కోట్ల నుంచి రూ.1.55 కోట్లకు చేరింది. ఏప్రిల్ 30వ తేదీ రూ.2.10 కోట్లు, మే 1వ తేదీన రూ.2.26 కోట్లు, జూన్ 2వ తేదీ రూ.2.11 కోట్లు గడించింది.

జిల్లా సమాచారం

డిపోల సంఖ్య- 11	రోజువారీ ప్రయాణికులు దాదాపు 5.75 లక్షలు
సర్వీసులు- 814	రోజువారీ రాబడి- రూ.2 కోట్లు
విద్యుత్ బస్సులు-100	డ్రైవింగ్ స్కూల్-01
ఉద్యోగుల సంఖ్య-4,255	

కార్గో సేవల పెంపు

జిల్లాలోని ఆర్టీసీ దుకాణాలు 501 ఉండగా వీటిలో ఎప్పుడూ 50శాతం ఖాళీగా దర్శనమిస్తుండేవి. తద్వారా ఏడాదికి రూ.22 కోట్ల రాబడి మాత్రమే వచ్చేది. ఇటీవల ప్రతి నెలా ఖాళీగా ఉన్న దుకాణాలను లీజుకు ఇచ్చేందుకు టెండర్లు ఆహ్వానిస్తున్నారు. దీంతో ప్రస్తుతం 435 దుకాణాలు భర్తీ చేశారు. వీటి ద్వారా ఏటా రూ.14 కోట్ల ఆదాయం వస్తోంది. ఇంకా మరో 69 దుకాణాలు ఖాళీగా ఉన్నాయి. వీటిని భర్తీ చేస్తే మరో రూ.8 కోట్ల నుంచి రూ.10 కోట్ల రాబడి వచ్చే అవకాశం ఉంది. మరోవైపు జిల్లాలోని 11 డిపోల పరిధిలో 60 శాతం మాత్రమే ఆర్టీసీ స్థలాటు లీజుకు నడుస్తున్నాయి. మిగిలిన వాటిని లీజుకు ఇవ్వడానికి వ్యాపారులకు అవగాహన కల్పించారు. మరోవైపు కార్గో ఆదాయం ఏడాదికి రూ.2.50 కోట్ల నుంచి రూ.3 కోట్లు సమకూరుతుండగా.. దీన్ని 2023-24కి సంబంధించి రూ.4 కోట్లకు పెంచారు. 2024-25కి రూ.6 కోట్లకు పెంచడానికి ప్రయత్నాలు చేస్తున్నారు.

జిల్లాలో మోస్తరు వర్షం

తిరుపతి అర్బన్: జిల్లా గురువారం 819.6 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా వడమాలపేటలో 84.4 మి.మీ వర్షం నమోదు కాగా, అత్యల్పంగా వరదయ్యపాళెం మండలంలో 1.2 మి.మీ వర్షపాతం నమోదైంది. తిరుపతి అర్బన్‌లో 68.2, సూళ్లూరుపేటలో 55.4, నారాయణవనంలో 52.8, దొరవారిసత్రం 43.6, కేవీబీపురం 40.4, తిరుపతి రూరల్ 36.2, రామచంద్రాపురం 34.2, పుత్తూరు 33.8, బాలాయపల్లి 33.8, రేణిగుంట 32.4, గూడూరు 32.2 వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

తడిసి ముద్దయిన తిరుమల

తిరుమల : వర్షపు చినుకులతో తిరుమల పుణ్యక్షేత్రం తడిసి ముద్దయ్యింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. స్వామివారి దర్శనానంతరం వెలుపలకు వచ్చిన భక్తులు తడుస్తూ వెళ్లడం కనిపించింది.


తిరుమల ఆలయం ఎదుట వర్షపునీరు


తిరుమల : తడుస్తూ..తలదాచుకుంటూ



వర్షంలో తడుస్తూ వెళ్తున్న భక్తులు